# పెళ్లానికో ఉత్తరం

రేడియో స్టేషన్‌లో పనిచేసే ఓ ఎనౌన్సరు పురిటికి పుట్టింటికి వెళ్ళిన తన భార్యారత్నానికి ఇలా ఉత్తరం రాశాడు:

శక సంవత్సరం 1898.
మాఘం 12,
అనగా 1976 వ సంవత్సరం డిశంబర్
5వ తేదీ ఉదయం—

ప్రియమైన భార్యారత్నానికి...

నేను క్షేమంగానే ఉన్నాను నీ ఆరోగ్యం ఎలా ఉంటోంది ?...ప్రతి స్త్రీకి మాతృత్వం అనేది దేవుడిచ్చే దివ్యమైన వరం !... అదొక అందమైన అనుభూతి !! ఆ అనుభూతి నీకు త్వరలోనే కలుగబోతోంది...ఆరోగ్యం జాగ్రత్త...

ఇహపోతే, నువ్వులేని ఇల్లు-ఎనౌన్స్‌మెంటు లేని కార్యక్రమంలా అయోమయంగా ఉంటోంది ... మూడురోజుల క్రితం పనిమీద విజయవాడ వచ్చి — అట్నుంచి మీ ఊరు కూడా రావాలని అనుకున్నాను ... కాని అనివార్య కారణాలవల్ల కార్యక్రమంలో అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నాను...

ఇక్కడ వాతావరణంలో చెప్పుకోదగిన మార్పులు ఏమీ లేవు ... గాలిలో తేమమాత్రం మూడు శాతం ఉంటోంది. ...మీ ఊళ్ళో చెదురుమదురుగా జల్లులు పడుతున్నాయని విన్నాను ... వానలో తడిసేవ్ జాగ్రత్త !...

ఇప్పుడు సమయం పదకొండు గంటలు కావస్తోంది ... మరికొన్ని క్షణాల్లో నేను డ్యూటీకి వెళ్ళాలి... విశేషాలు మళ్ళీ ఉత్తరంలో ముచ్చటించుకుందాం...

అంతవరకూ శలవా మరి ?...

నీ

...............”

*జీడిగుంట రాజ్యలక్ష్మి*